# రామన్నపేటలో నిరసనల హోరు

## సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ముక్త కంఠంతో వ్యతిరేకించిన ప్రజలు

- నినాదాలు, నిరసనలతో హోరెత్తిన వేదిక
- ప్రజాభిప్రాయ సేకరణకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- పట్టణంలో స్వచ్ఛందంగా బంద్ నిర్వహించిన వ్యాపారులు

రామన్నపేట, అక్టోబర్ 23 : తమ భవిష్యత్‌ను, భావితరాల బతుకును అంధకారం చేసే అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతించవద్దని రామన్నపేట మండల ప్రజలు ముక్త కంఠంతో నినదించారు. పరిశ్రమ ఏర్పాటుకు బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అంబుజా గోబ్యాక్.. అదానీ గోబ్యాక్.. సేవ్ రామన్నపేట అంటూ నినదించారు. మండల ప్రజలు స్వచ్ఛందంగా తమ వ్యాపారాలను, షాపులను మూసివేసి ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు వేలాదిగా తరలివచ్చారు. అందరి నినాదం ఒక్కటే అంబుజా హఠావో.. రామన్నపేట బచావో. యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్లకార్డులతో, నల్లరంగు టీషర్టులతో అంబానీ గోబ్యాక్ అంటూ నిరసన తెలిపారు. సూర్యాపేట, ఖమ్మం, మేళ్లచెర్వు, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల నుంచి ఎన్జీఓల ముసుగులో కిరాయి మనుషులు వచ్చి షామియానాలో కూర్చుండటంతో గ్రహించిన స్థానికులు వారిని నిలదీశారు. ఆగ్రహంతో కంపెనీ పరిసరాల నుంచి బయటికి తరిమివేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందేహాలు, అభ్యంతరాల సేకరణ కోసమేనని, ప్రాజెక్టు క్లియరెన్స్ కోసం కాదని ప్రజల అభ్యంతరాలను నమోదు చేసి ఉన్నత స్థాయి కమిటీకి తెలియ పరుస్తామని స్థానికేతరులకు మాట్లాడే అవకాశం ఇవ్వబోమని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ హామీ ఇచ్చారు. దీంతో స్థానిక ప్రజలు శాతించి ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని పరిశ్రమ వద్దని ముక్త కంఠంతో వ్యతిరేకించారు.



రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణ కేంద్రం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు


ప్రజాభిప్రాయ సేకరణ వద్ద ఆందోళన


సమావేశంలో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ అధికారి సంగీత, చిత్రంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్


ప్రజాభిప్రాయ సేకరణ వద్ద పార్కింగ్ చేసిన జనం వాహనాలు


రామన్నపేటలో స్వచ్ఛందంగా మూసివేసిన దుకాణాలు

## అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం | మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

మోత్కూరు, అక్టోబర్ 23 : ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ జనావాసాల నడుమ ఏర్పాటు చేయొద్దని ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న తనను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అప్రజాస్వామికమని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. రామన్నపేటలో నిర్వహించిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు బుధవారం వెళ్తుండగా పోలీసులు రామన్నపేట సమీపంలో అరెస్టు చేసి మోత్కూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల ప్రాణాలకు ముప్పు చేసే ఫ్యాక్టరీలను అడవుల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మొదలు డ్రైపోర్ట్ ఏర్పాటు కోసం 365 ఎకరాల స్థలాన్ని సేకరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు ఎలా అనుమతి ఇస్తుందని ప్రశ్నించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష ధోరణితో పోలీసు బలగాలతో ప్రజాభిప్రాయాన్ని అడ్డుకుంటున్నారన్నారు. తాను మాజీ ఎంపీని కావడంతో ప్రజల పక్షాన తన గళాన్ని వినిపించకుండా పోలీసులతో ప్రభుత్వం అడ్డుకొని పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిందని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, జంగ శ్రీను, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండ సోంమల్లు, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, జిల్లా నాయకులు మర్రి అనిల్ కుమార్, అన్నందాసు విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, పరమేశ్ పాల్గొన్నారు.


మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ నిర్బంధం

### రైతులు తీవ్రంగా నష్టపోతారు



సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. మండలంలో 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ధర్మారెడ్డి పల్లి కాల్వను సాగు నీటి కోసం తాము కొట్లాడి తెచ్చుకుంటే దానిని సిమెంట్ పరిశ్రమకు ఉపయోగించుకొనేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కంపెనీ వస్తే 170 ట్రక్కులు రోజూ నడుస్తాయని, దుమ్ము దూళి వస్తుందని కంపెనీ నివేదికలోనే పొందు పరిచారు. పరిశ్రమ వల్ల ప్రజలు ప్రమాదకరమైన రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.

**- మేక అశోక్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, సిరిపురం**

### కులవృత్తులు దెబ్బ తింటాయి



సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే కులవృత్తులు దెబ్బతింటాయి. పరిశ్రమకు మండల ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడి ప్రజలు గీత, పద్మశాలీ, గొర్రెలు, చేపలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ పరిశ్రమ వల్ల ప్రజలకు నష్టాలే తప్ప లాభాలు లేవు. అదానీ కంపెనీవారు రూపొందించిన నివేదికను పూర్తిగా చదివాను. బీఆర్ఎస్ పార్టీ తరపున అంబుజా సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నా.

**-పోశబోయిన మల్లేశం, బీఆర్ఎస్ రామన్నపేట మండల కార్యదర్శి, జనంపల్లి**

### సిమెంట్ పరిశ్రమకు అనువైన ప్రదేశం కాదు



రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం గ్రామాల నడిబొడ్డున సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు స్థలం అనువైనది కాదు. ఇక్కడ సిమెంట్ నిక్షేపాలు లేవు. సిమెంట్ పరిశ్రమను నూటికి నూరుశాతం వ్యతిరేకిస్తున్నాం. ఇక్కడి ప్రజలు జల, వాయు, శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు, రోగాల బారిన పడతారు. వ్యవసాయం, చేసుకుంటూ కుల వృత్తులతో జీవనం సాగించే ప్రజలపై కాలుష్య భారం మోపడం సరికాదు.

**-సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి, ఎండీ జహంగీర్, మునిపంపుల**

### పర్యావరణం దెబ్బ తింటుంది



సిమెంట్ పరిశ్రమ వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. జల, వాయు, శబ్ద కాలుష్యంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుంది. సన్నకారు రైతుల వద్ద నుంచి డ్రైపోర్టు పేరుతో భూములు కొనుగోలు చేసి కాలుష్య కారకమైన పరిశ్రమ ఏర్పాటు చేస్తామనడంతో ప్రజలు క్షమించరు. ప్రజలకు ఉపాధి కలిగించే పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. మా గ్రామానికి కూత వేటు దూరంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు. దీనిని అంతా వ్యతిరేకిస్తున్నాం.

**-జెల్లెల పెంటయ్య, పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్, కొమ్మాయిగూడెం**

### ప్రతి ఒక్కరూ అనారోగ్యం పాలవుతారు



సిమెంట్ పరిశ్రమ వల్ల తల్లి గర్భంలో పెరుగుతున్న పిల్ల నుంచి వృద్ధుల వరకు అనారోగ్యం పాలవుతారు. కాలుష్యం వల్ల ఊర్లకు ఊర్లు ఖాలి చేసి వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. యువకులు, విద్యార్థులు ముక్తకంఠంతో నిరసన తెలిపి కంపెనీ ఏర్పాటును పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు.

**-కడారి స్వామి యాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు, నిదానపల్లి గ్రామం**

### హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తాం



రైతుల వద్ద డ్రైపోర్టు పేరుతో తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి నేడు కాలుష్య కారకమైన సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేస్తామనడం బాధాకరం. సిమెంట్ పరిశ్రమకు ప్రతిపాదిత స్థలం నుంచి ఐదు వందల గజాల దూరంలోనే ప్రభుత్వం సబ్‌కోర్టు, మున్సిఫ్, అదనపు కోర్టుల నిర్మాణానికి ఐదెకరాల భూమిని కేటాయించింది. ఇంత దూరంలోనే సిమెంట్ పరిశ్రమకు ఎలా అనుమతులు ఇస్తారు. కంపెనీని ముక్త కంఠంతో ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అవసరమైతే హైకోర్టులో రిట్ పటిషన్ దాఖలు చేస్తాం.

**- ఎంఏ మజీద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, రామన్నపేట**

### అరెస్టులతో ప్రజల గొంతు నొక్కలేరు



శాంతియుతంగా ప్రజాభిప్రాయ సేకరణకు వస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. అరెస్టులు చేసి ప్రజల గొంతును నొక్కలేరు. ఇక్కడి ప్రాంత ప్రజలు అంబుజా సిమెంట్ కంపెనీని వ్యతిరేకిస్తున్నారు. కాలుష్య కర్మాగారాలు కాకుండా యువకులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

**- సుధీర్‌బాబు మాజీ ఎంపీటీసీ, జనంపల్లి**

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- విద్యార్థి నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట


కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 23 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విద్యార్థి సంఘం నాయకులు కలెక్టరేట్ ప్రధాన గేటు పైనుంచి దూకేందుకు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి రాగానే బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కి పది నెలలు అవుతున్నా హామీ నెరవేర్చలేదని విమర్శించారు. విద్యా శాఖను తన వద్దే పెట్టుకున్న సీఎం.. ఆ శాఖకు నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు మొత్తం ఒకేసారి ఈ నెల 27 వరకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని, చలో ఇందిరాపార్క్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరారం జానీ, సహాయ కార్యదర్శి మారపాక లోకేశ్, జిల్లా సమితి సభ్యులు రాపాక చందు, సాయిచరణ్, నాయకులు ఉదయ్‌కిరణ్, సుమన్, విల్సన్, రజిత, ప్రవళిక, సోనీ, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయ సేకరణ అంటూ.. గొంతునొక్కే యత్నం

### రామన్నపేటకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి అరెస్ట్


నాంపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చిట్యాల, అక్టోబర్ 23 : రామన్నపేట మండలంలో ఆదాని సంస్థ ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్ కంపెనీపై బుధవారం ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. సిమెంట్ పరిశ్రమ వల్ల తమ ప్రాంతానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటూ స్థానికులు దానిని వ్యతిరేకిస్తున్నారు. అన్ని సంఘాలు ఏకమై వ్యతిరేకించినా కంపెనీ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సిమెంట్ పరిశ్రమ వల్ల కలిగే నష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తున్న నాయకులను అరెస్ట్ చేసి నిర్బంధించారు. రామన్నపేటకు వెళ్లే రోడ్డులో పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లే ప్రజలను అడ్డుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను వట్టిమర్తి శివారులోని ఓ హోటల్ వద్ద పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి మునుగోడు, చండూరు మీదుగా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తన అభిప్రాయం చెప్పడానికి వెళ్తున్నానని ఎంత చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనడానికి వెళ్లే నాయకులను, ప్రజలను అరెస్టు చేసి అభిప్రాయాలు ఎలా సేకరిస్తారని ప్రశ్నించా రు. ఇది ముమ్మాటికి ప్రజాస్వామానికి వ్యతిరేకమన్నారు. కాలుష్యాన్ని వెదజల్లే సిమెంటు కంపెనీ ఏర్పాటుతో ప్రజలు, జంతువులు, పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇది ప్రభుత్వ దౌర్జన్యానికి, అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజా పోరాట సమితి అధ్యక్షుడు నూనె వెంకట స్వామిని అరెస్టు చేసి కట్టంగూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### తరలిన పెద్దకాపర్తి నాయకులు

ప్రజాభిప్రాయ సేకరణకు మండలంలోని పెద్దకాపర్తికి చెందిన అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేయవద్దంటూ ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుతూ తరలివెళ్లారు.

### నాంపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

నాంపల్లి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ నాంపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో పాటు నాంపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ నక్క చంద్రశేకర్, నాయకులు బెల్లి సత్తయ్య, బుషిపాక నగేశ్, కర్నె యాదయ్య, బైరపాక ఎల్లయ్య, బుషిపాక ఏడుకొండల్, గంజీ సంజీవ, గౌరు కిరణ్, జనార్దన్ పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యేలు హౌస్ అరెస్ట్

నల్లగొండ : రామన్నపేటలో అంబుజా సిమెంట్ కోసం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు హాజరు కాకుండా జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవింద్ర కుమార్‌తో పాటు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని బుధవారం కంచర్ల నివాసంలో పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. అదే సమయంలో వచ్చిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని సైతం అరెస్ట్ చేశారు.

## దేవరకొండ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బాలూనాయక్


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), అక్టోబర్ 23 : దేవరకొండ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ముత్యాలమ్మ కాలనీ నుంచి పర్వతాల చెరువు వరకు రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ పట్టణాభివృద్ధికి అధిక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, భోజన వసతులు, తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్లలో ఎస్సెల్బీసీని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆలింపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ జమునా మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదుగాలి : ఎమ్మెల్యే వీరేశం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్,అక్టోబర్ 23 : మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదుగాలని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. బుధవారం నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ శోభారెడ్డి, మెప్మా ఇన్‌చార్జి సీహెచ్.పద్మ, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.